మరిన్ని వార్తలు
ntnews.com
లో చూడగలరు

నలుగురు మావోయిస్టులు మృతి

- గడ్చిరోలి దండకారణ్యంలో తుపాకుల మోత
- మృతుల్లో మంచిర్యాల, ఇంద్రవెల్లి కమిటీ సభ్యులు
- ఆయుధాలు, సాహిత్యం స్వాధీనం

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ) / కొత్తగూడెం క్రైం : దండకారణ్యంలో తుపాకుల మోత మోగింది. మహారాష్ట్రలోని గడ్చిరోలి రక్తమోడింది. పోలీసులు, మావోయిస్టులకు మధ్య జరిగిన భీకర కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు చనిపోయినట్లు గడ్చిరోలి ఎస్పీ నీలోత్పాల్ మంగళవారం ధ్రువీకరించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో విధ్వంసాలకు పాల్పడేందుకు తెలంగాణ నుంచి పలువురు మావోయిస్టులు గడ్చిరోలి సరిహద్దులోకి ప్రవేశించారని విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు అడిషనల్ ఎస్పీ యతీశ్ దేశ్‌ముఖ్ నేతృత్వంలోని కోలమర్క అడవుల్లో సీ-60, సీఆర్‌పీఎఫ్ క్విక్ యాక్షన్ టీమ్స్ కూంబింగ్ నిర్వహించాయి. ఎస్పీఎస్ రేపన్‌పల్లి సమీపంలోని కోలమర్క కొండప్రాంతంలో మావోయిస్టులు తారసపడి జవాన్లపై కాల్పులు ప్రారంభించారు. పోలీసు బలగాలు దీటుగా కాల్పులు జరుపుతూ ముందుకు కదులుతుండటంతో.. మావోయిస్టులు ప్రాణరక్షణకు పారిపోయినట్లు ఎస్పీ తెలిపారు. అనంతరం కాల్పులు జరిగిన ప్రాంతంలో సోదాలు చేయగా నలుగురు మావోయిస్టుల మృతదేహాలు దొరికినట్లు చెప్పారు. మృతుల్లో ఇంద్రవెల్లి ఏరియా కమిటీ కార్యదర్శి పోడియం పాండు అలియాస్ మంగులు (32), కుమ్రంభీం మంచిర్యాల డివిజన్ కమిటీ సభ్యుడు వర్గేశ్ (28), ప్లాటూన్ సభ్యులు కుడిమెట్ట వెంకటేశ్, కుర్సంగ్ రాజు ఉన్నట్లు పోలీసులు ధ్రువీకరించారు. వీరిపై సుమారు రూ.36 లక్షల రివార్డులు ఉన్నట్లు మహారాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఘటనా స్థలంలో ఏకే-47 రైఫిల్, కార్బైన్ రైఫిల్, రెండు కంట్రీ మేడ్ పిస్టల్స్, లైవ్ రౌండ్లు, ఇతర పేలుడు పదార్థాలు, నక్సల్ సాహిత్యం స్వాధీనం చేసుకున్నారు. ఐజీ ఏఎన్‌ఏవో సందీప్ పాటిల్, గడ్చిరోలి రేంజ్ డీఐజీ అంకిత్ గోయెల్, సీఆర్పీఎఫ్ డీఐజీ (ఆపరేషన్స్) జగదీశ్ మీనా, గడ్చిరోలి ఎస్పీ నీలోత్పాల్, అడిషనల్ ఎస్పీ యతీశ్ దేశ్‌ముఖ్, అడిషనల్ ఎస్పీ అహేరి రమశే, డీఎస్పీ విశాల్ నాగర్గోజే నేతృత్వంలో ఆపరేషన్ విజయవంతంగా కొనసాగినట్లు వెల్లడించారు.

ఛత్తీస్‌గఢ్‌లో మరో ఇద్దరు ..

దంతెవాడ, మార్చి 19: ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో మంగళవారం చోటుచేసుకున్న ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు నక్సలైట్లు మరణించారు. వీరిలో ఒక మహిళ ఉన్నారని పోలీసులు వెల్లడించారు. నిఘా వర్గాల సమాచారం మేరకు కిరందుల్ పోలీసుస్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు సంయుక్తంగా చేపట్టిన యాంటీ నక్సలైట్ ఆపరేషన్ సందర్భంగా ఈ ఎన్‌కౌంటర్ జరిగిందని జిల్లా ఎస్పీ గౌరవ్ రాయ్ తెలిపారు. కాల్పుల్లో ఇద్దరు నక్సలైట్లు మరణించగా, పలువురికి గాయాలయ్యాయని పేర్కొన్నారు. ఘటనాస్థలం నుంచి మృతదేహాలతోపాటుగా ఆయుధాలు, కొన్ని పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకొన్నామని వెల్లడించారు. సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్నదని తెలిపారు.

పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరించండి

మావోయిస్టు రాష్ట్ర కమిటీ లేఖ

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): హిందూ మతోన్మాదాన్ని, జాతీయోన్మాదాన్ని, యుద్ధోన్మాదాన్ని రెచ్చగొట్టి ప్రజల ఓట్లను దండుకునేందుకు బీజేపీ సిద్ధంగా ఉన్నదని మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ పేర్కొన్నది. బ్రాహ్మణీయ, ఫాసిస్టు ప్రమాదం నుంచి దేశాన్ని రక్షించేందుకు ప్రజలు లోక్‌సభ ఎన్నికలను బహిష్కరించాలని పిలుపునిస్తూ ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జగన్ మంగళవారం ఓ లేఖను విడుదల చేశారు. ఎన్నికల్లో గెలిచేందుకు ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ దుర్మార్గపు పన్నాగం పన్నాయని తెలిపారు. ఎన్నికల కమిషన్‌ను కీలుబొమ్మగా మార్చేందుకు కుట్రలు చేస్తున్నారని తెలిపారు. మోదీ పరిపాలనలో నిరంకుశత్వ హిందుత్వ రాష్ట్రాన్ని స్థాపించే లక్ష్యంతో బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజాన్ని అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాధికారాన్ని సాధించుకోవడానికి ప్రజలు నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగస్వామం కావాలని పిలుపునిచ్చారు.

విద్యా - ఉద్యోగ సమాచారం

‘గ్రేడ్-2 భాషా పండితులకు పదోన్నతులివ్వాలి’

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ) : హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పును లోబడి గ్రేడ్ -2 భాషాపండితులకు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు కల్పించాలని రాష్ట్ర భాషోపాధ్యాయ సంఘం - తెలంగాణ రాష్ట్రం (ఎస్ఎల్‌టీఏ) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ సభ్యుడు ప్రొఫెసర్ కోదండరాంను కలిసి సంఘం ప్రతినిధి బృందం వినతిపత్రం అందజేసింది. హైకోర్టు తీర్పును అమలుచేసి, పదోన్నతులు కల్పించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చక్రవర్తుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కర్రెం గౌరిశంకర్‌రావు కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘం నేతలు షేక్ హాజీ నూజీరానీ, జగదీశ్వర్, ఎండీ హమీద్, చౌడవరం చంద్రమోహన్, వెంకటేశ్వర్లు, కుమారస్వామి, శ్రీహరి, భాస్కర్, రాజ్‌గోపాల్‌సింగ్, సంతోష్, జంగయ్య తదితరులు ఉన్నారు.

‘గేట్’ గట్టెక్కింది 19శాతమే

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ) : గ్రాడ్యుయేట్ అప్టిట్యూ డ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్‌లో ఈ ఏడా ది 19శాతం విద్యార్థులు మాత్రమే అర్హత సాధించారు. గేట్ ఫలితాలు ఇటీవలే విడుదలైన విషయం తెలిసిందే. ఈ సారి మొత్తం 8,26,239 మంది విద్యార్థులు గేట్ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా, 6,53,292 విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 1,29,268 మంది విద్యార్థులు అర్హత పొందారు. ఈ ఏడాది డాటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పేపర్‌ను ప్రవేశపెట్టగా, దీనికి 52,743 దరఖాస్తులు రాగా, 8,378 మంది విద్యార్థులు క్వాలిఫై అయ్యారు.

ఎల్‌పీసెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ) : ఐటీఐ కోర్సు పూర్తిచేసిన వారు పాలిటెక్నిక్ రెండో సంవత్సరంలో ప్రవేశాలకు మే 20న టీఎస్ ఎల్‌పీసెట్ నిర్వహిస్తామని సాంకేతిక విద్యామండలి కార్యదర్శి పుల్లయ్య తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు 2024-25 విద్యాసంవత్సరానికి ఏప్రిల్ 20లోపు ఎల్‌పీసెట్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష వాయిదా

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ) : సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష వాయిదా పడింది. సివిల్ సర్వీసెస్, ఫారెస్ట్ సర్వీసెస్ ఉద్యోగాల భర్తీకి నిర్వహించే స్క్రీనింగ్ పరీక్షలను యూపీఎస్సీ వాయిదావేసింది. లోక్‌సభ ఎన్నికల కారణంగా మే 26న జరగాల్సిన ప్రిలిమినరీ పరీక్షను వాయిదావేసిన యూపీఎస్సీ జూన్ 16న నిర్వహిస్తామని ప్రకటించింది. సివిల్ సర్వీసెస్‌లో 1,056, ఫారెస్టు సర్వీసుల్లో 150 ఉద్యోగాలున్నాయి. యూపీఎస్సీ మెయిన్స్ పరీక్షలు అక్టోబర్ 19 నుంచి నిర్వహిస్తారు.

మైనార్టీ గురుకుల ఇంటర్ విద్యార్థులకు ఇంటర్వ్యూలు

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): మైనార్టీ గురుకులాల్లో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు ఉద్యోగాలిచ్చేందుకు ఎంఎస్ఎన్ ల్యాబ్స్ ముందుకొచ్చింది. ఇందుకు ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, ఫార్మా టెక్నాలజీ, ఎంఎల్‌టీ పూర్తి చేసిన విద్యార్థులు ఇంటర్వ్యూకు హాజరుకావాలని మైనార్టీ గురుకులాల సొసైటీ కార్యదర్శి సూచించారు. ఈ నెల 21న కరీంనగర్‌లోని టీఎంఆర్జేసీ గర్ల్స్-2లో, 22న నిజామాబాద్‌లోని టీఎంఆర్ వొకేషనల్ కాలేజీ బాయ్స్- 4లో, 23న నిర్మల్ చించోలిలోని టీఎంఆర్ జూనియర్ కాలేజీ బాయ్స్-1లో ఇంటర్వ్యూలు ఉంటాయని వివరించారు. నిరుడు ఇంటర్ పూర్తిచేసినవారు, ఈ ఏడాది ఇంటర్ చివరి సంవత్సరం పరీక్షలు రాసిన వారు అర్హులని తెలిపారు. అభ్యర్థులు 20 ఏండ్లలోపే ఉండాలని, కనీసం 55 శాతం మార్కులు సాధించి ఉండాలని చెప్పారు. వివరాలకు 7032119370కు సంప్రదించాలని సూచించారు.

ముగిసిన ఇంటర్ వార్షిక పరీక్షలు

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ) : లెక్చరర్లు, ప్రిన్సిపాళ్ల సస్పెన్షన్లు మినహా ఈ సారి ఇంటర్ వార్షిక పరీక్షలు సజావుగానే ముగిశాయి. ప్రధాన పరీక్షలు గత గురువారం ముగియగా, మైనర్ సబ్జెక్టులకు పరీక్షలు మంగళవారం వరకు కొనసాగాయి. ఈ సారి సెల్‌ఫోన్లు పరీక్షల్లో కలకలం సృష్టించాయి. మార్చి 1న కామారెడ్డి జిల్లా సదాశివనగర్‌లో సెల్‌ఫోన్లు తీసుకెళ్లడంతో ఇద్దరు లెక్చరర్లు సస్పెన్షన్‌కు గురికాగా, మార్చి 2న మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ముగ్గురిపై వేటుపడింది. ప్రస్తుతం సమాధానపత్రాల మూల్యాంకన ప్రక్రియ కొనసాగుతండగా, ఫలితాలు ఏప్రిల్ రెండో వారంలో విడుదల కానున్నాయి.

పది మంది చిన్నారులను కరిచిన వీధి కుక్క

నాగర్‌కర్నూల్, మార్చి 19 : ఒకే రోజు పది మంది చిన్నారులపై శునకం దాడి చేసి గాయపరిచిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటుచేసుకున్నది. నాగర్‌కర్నూల్ పట్టణంలోని ఎండబెట్ల గ్రామంలో సోమవారం మధ్యాహ్నం ఒంటి పూట బడి ముగియగానే ఇండ్లకు బయలుదేరిన చిన్నారులతోపాటు ఇండ్ల ముందు ఉన్న పిల్లలపై శునకం దాడి చేసింది. ఒకే వీధి కుక్క దాడిలో సుమారు 10 మంది వరకు గాయపడ్డారు. చిన్నారులను జిల్లాకేంద్రంలోని జనరల్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతున్నారు.

అవే తప్పిదాలు.. అదే నిర్లక్ష్యం

- ‘పది’ పరీక్షల్లో సిబ్బంది నిర్వాకం
- కాపీయింగ్‌కు పాల్పడుతున్నా పట్టించుకోని వైనం
- విధుల నుంచి తొలగింపు, షోకాజ్ నోటీసులు

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ) : పదోతరగతి పరీక్షల్లో అధికారులు అప్రమత్తంగా ఉంటున్నా.. కఠినంగా వ్యవహరిస్తున్నా సిబ్బంది నిర్లక్ష్యంతో తప్పిదాలు జరుగుతూనే ఉన్నాయి. రోజుకో చోట కాపీయింగ్ ఘటనలు వెలుగుచూస్తున్నాయి. సిబ్బంది నిర్వాహకాన్ని ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకొంటున్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై వేటు వేస్తున్నారు. తాజాగా మంగళవారం పది మంది సిబ్బందిని పరీక్షల విధుల నుంచి తప్పించారు. వీరి స్థానంలో ఇతరులకు విధులు కేటాయించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఓ పరీక్షాకేంద్రంలో నాలుగు మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయి. దీంతో అధికారులు ముగ్గురు ఇన్విజిలేటర్లను, చీఫ్ సూపరింటెండెంట్‌ను, డిపార్ట్‌మెంటల్ అధికారిని విధుల నుంచి తప్పించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఓ పరీక్షాకేంద్రంలో పర్యవేక్షణ లోపంతో పాటు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇన్విజిలేటర్, ఇదే కారణంతో కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గోపాలరావు పేట్ జడ్పీహెచ్‌ఎస్‌లో చీఫ్ సూపరింటెండెంట్, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో ఇన్విజిలేటర్‌తో పాటు చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులను విధుల నుంచి తొలగించారు. అలాగే విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఆయా సిబ్బంది, అధికారులకు షోకాజ్ నోటీసులు జారీచేశారు.

ఐదు మాల్‌ప్రాక్టీస్ కేసులు

మంగళవారం ద్వితీయభాష పేపర్‌కు పరీక్ష నిర్వహించగా, స్క్వాడ్ తనిఖీల్లో ఐదుగురు విద్యార్థులు పట్టుబడ్డారు. వీరిపై అధికారులు మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు చేశారు. పరీక్షకు 4,94,426 మంది రెగ్యులర్ విద్యార్థులకు 4,92,967 మంది విద్యార్థులు (99.70) హాజరుకాగా, 1,459 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇక ప్రైవేట్ విద్యార్థుల్లో (గతంలో ఫెయిలైనవారు) 400 మంది విద్యార్థులకు 214 మంది పరీక్ష రాసినట్టు పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు తెలిపారు.

మెయిన్ జవాబు పత్రం ఇవ్వకుండా అడిషనల్ పత్రాల్లోనే పరీక్ష

పాల్వంచ పరీక్షా కేంద్రంలో తప్పిదం

పాల్వంచ, మార్చి 19: ఖమ్మం జిల్లా పాల్వంచలోని కేటీపీఎస్ పదోతరగతి పరీక్షా కేంద్రంలో సోమవారం జరిగిన తప్పిదం మంగళవారం వెలుగు చూసింది. ఓ తరగతి గదిలో పరీక్ష రాస్తున్న విద్యార్థులకు ఇన్విజిలేటర్ మెయిన్ జవాబు పత్రం ఇవ్వకుండా కేవలం అడిషనల్ పత్రాలపైనే పరీక్ష రాయించారు. రూమ్ నంబర్ 9లో తెలుగు పరీక్ష రాస్తున్న 24 మంది విద్యార్థులకు ఇన్విజిలేటర్ సరోజిని అదనపు జవాబు పత్రాన్ని ఇచ్చారు. మంగళవారం హిందీ పరీక్షకు ఇదే గదికి వచ్చిన ఇన్విజిలేటర్ మెయిన్ జవాబు పత్రాన్ని విద్యార్థులకు ఇచ్చారు. దీంతో కంగుతిన్న విద్యార్థులు సోమవారం అదనపు జవాబు పత్రం ఇచ్చారని ఇన్విజిలేటర్‌కు తెలిపారు. ఇన్విజిలేటర్ వెంటనే డిపార్ట్‌మెంటల్ అధికారికి సమాచారం అందించారు. డీఈవో వెంకటేశ్వరచారి స్పందించి ఇన్విజిలేటర్ సరోజినితోపాటు డిపార్ట్‌మెంటల్ అధికారి, చీఫ్ సూపరింటెండెంట్‌నూ విధుల నుంచి తొలగించారు. దీనిపై ఎంఈవో శ్రీరామమూర్తిని వివరణ కోరగా.. పరీక్షా కేంద్రంలో తప్పిదం జరిగిన మాట వాస్తవమేనని, కానీ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు.

మురుగు నీటిపై నిరంతర నిఘా

- వ్యాధులను గుర్తించేందుకు సీవరేజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్
- వివిధ సంస్థలతో కలిసి అందుబాటులోకి తెచ్చిన సీసీఎంబీ
- దేశంలోని అన్ని నగరాలు, పట్టణాల్లో అమలుకు సన్నాహాలు

తొలుత పోలియో ట్రాకింగ్

మురుగునీటిని పరీక్షించి వ్యాధికారకాలను గుర్తించడం పాత విధానమే. మన దేశంలో తొలుత పోలియో వైరస్‌ను ట్రాక్ చేసేందుకు సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (సీడీసీ) ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్‌ను ఉపయోగించారు. ఆ తర్వాత ఇదే విధానాన్ని అనుసరించి కరోనా వైరస్ తీవ్రతను గుర్తించారు. ప్రస్తుతం పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చిన సీవరేజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్‌తో మరెన్నో కొత్త వ్యాధులను గుర్తించే వీలు ఉంటుందని పరిశోధకులు చెప్తున్నారు.

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 19 (నమస్తే తెలంగాణ): మురుగునీటి ద్వారా ప్రబలే వివిధ రకాల వ్యాధులను గుర్తించేందుకు హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) శాశ్వత నిఘా వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. కొవిడ్ సమయంలో హైదరాబాద్‌లోని మురుగునీటిని పరిశీలించి వైరస్ తీవ్రతను గుర్తించిన సీసీఎంబీ పరిశోధకులు జాతీయ స్థాయిలోని పలు పరిశోధన సంస్థలతో కలిసి సీవరేజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందులో సీసీఎంబీతోపాటు ఐఐసీటీ, ఐసీఎంఆర్-ఎన్ఐఎన్ లాంటి సంస్థలు ముఖ్యపాత్ర పోషించాయి. హైదరాబాద్‌తోపాటు మహారాష్ట్రలోని ముంబై, జల్నా, కోల్‌కతా, చెన్నై తదితర నగరాలతోపాటు పలు పట్టణాల్లో ఈ విధానం అద్భుత ఫలితాలను ఇచ్చింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ, సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ లాంటి సంస్థలు ఇప్పటికే ఉపయోగిస్తున్న ఈ విధానాన్ని దేశవ్యాప్తంగా అన్ని నగరాలు, పట్టణాల్లో అమలు చేయనున్నారు. అందులో భాగంగా ఆయా ప్రాంతాల్లోని సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నుంచి మురుగునీటిని సేకరించి పీసీఆర్, ఆర్టీపీసీఆర్, క్యూఆర్టీ పీసీఆర్ లాంటి పరీక్షలు నిర్వహించడం ద్వారా వ్యాధికారక జీవుల ఉనికిని తెలుసుకుంటారు. కొత్తగా వ్యాప్తి చెందే వ్యాధులను త్వరగా పసిగట్టి, వాటి నియంత్రణకు చర్యలు చేపట్టేందుకు ఈ విధానం ఎంతో ఉపకరిస్తుందని నిపుణులు చెప్తున్నారు.

ఐస్‌క్రీమ్‌లో వీర్యం, మూత్రం?

- నెక్కొండలో విక్రేత రోత పని
- వీడియో వైరల్.. నిందితుడి అరెస్ట్
- శాంపిల్స్ సేకరించిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్

నెక్కొండ, మార్చి 19: ఐస్‌క్రీమ్‌ను తలుచుకుంటేనే వాంతి చేసుకునేంత పనిచేశాడో ప్రబుద్ధుడు. ఏం పైత్యమోగానీ.. ప్రజలకు అమ్మే ఐస్‌క్రీమ్‌లో తన వీర్యాన్ని, మూత్రాన్ని కలిపాడు. ఈ దారుణాన్ని చాటుగా సెల్‌ఫోన్‌లో చిత్రీకరించిన ఓ వ్యక్తి.. సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్ అయ్యింది. సదరు ప్రబుద్ధున్ని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వరంగల్ జిల్లా నెక్కొండలో రాజస్థాన్‌కు చెందిన కాలురాం పుర్బియా అనే వ్యక్తి ఐస్‌క్రీమ్ బండి పెట్టుకున్నాడు. అంబేద్కర్ కూడలిలో రోజూ ఐస్‌క్రీమ్‌లు విక్రయిస్తుంటాడు. బహిరంగంగానే తన వీర్యాన్ని, మూత్రాన్ని ఐస్‌క్రీమ్‌లో కలుపుతుండగా ఓ వ్యక్తి వీడియో తీశాడు. ఇది సోమవారం రాత్రి వైరల్ కావడంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఎస్సై మహేందర్ విచారణ చేపట్టి బహిరంగ ప్రదేశంలో హేయమైన చర్యకు పాల్పడ్డ కాలురాం పుర్బియాను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వరంగల్ జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ చేపూరి కృష్ణమూర్తి ఐస్‌క్రీమ్ బండికి సంబంధించిన శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు తరలించారు. పంచాయతీ కార్యదర్శి సదానందంతో కలిసి ఐస్‌క్రీమ్ బండిలోని ఐటమ్స్‌ను బయట పారబోయించారు. ఈ సందర్భంగా సీఐ చంద్రమోహన్ మాట్లాడుతూ.. బండ్లపై ఐస్‌క్రీమ్‌లు, తినుబండారాలు విక్రయించే వారు ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసేవారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రజలు కూడా ఇలాంటి వ్యాపారాలు చేస్తున్నవారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బయట పదార్థాలకు దూరంగా ఉంటేనే మంచిదని తెలిపారు. నెక్కొండలో ఐస్‌క్రీమ్‌లు అమ్మేవారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి హెచ్చరికలు జారీచేశారు.

నేటి నుంచి పీఆర్సీ కమిటీ సంప్రదింపులు

- పలు ఉద్యోగ సంఘాలకు ఆహ్వానం

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రెండో వేతన సవరణ విషయమై ఉద్యోగ సంఘాలతో పీఆర్సీ కమిటీ చర్చించనున్నది. బుధవారం నుంచి ఈ నెల 26 వరకు మొత్తం 27 సంఘాలతో పీఆర్సీ కమిటీ సమావేశాలు నిర్వహించనున్నది. హైదరాబాద్ బీఆర్‌కే భవన్‌లోని పీఆర్సీ కమిటీ కార్యాలయంలో ఈ భేటీలు జరుగనున్నాయి. ఈ మేరకు ఆయా సంఘాలకు షెడ్యూల్‌ను పీఆర్సీ కమిటీ అధికారులు సమాచారమిచ్చారు. తొలి దశలో ఆయా ఉద్యోగ సంఘాలతో పీఆర్సీ కమిటీ చైర్మన్ శివశంకర్, సభ్యుడు రామయ్య సమావేశమవుతారు. సంఘాల నేతలు సమర్పించిన ప్రతిపాదనలు, వాటి అమలులో సాధ్యాసాధ్యాలపై కమిటీతో చర్చిస్తారు.

ఉద్యోగాల సంఘాల కోరినివి ఇవే..

పీఆర్సీ కమిటీ.. ఇటీవలే ఆయా సంఘాల నుంచి లిఖితపూర్వకంగా ప్రతిపాదనలను స్వీకరించింది.కనీస వేతనం రూ. 35 వేలు, గరిష్ఠంగా రూ. 2,99,100కు పెంచడంపై ప్రతిపాదనలు అందాయి. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ పద్ధతిని కొనసాగించాలని, ఆటోమెటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీంను సవరించాలని,హెచ్ఆర్ఏను పెంచాలని సంఘాలు కోరాయి. ఇదే సమయంలో కనీస పెన్షన్ మొత్తాన్ని రూ.9,500 నుంచి రూ.17,500కు, రిటైర్మెంట్ గ్రాట్యూటీ రూ.16 లక్షల నుంచి రూ. 24 లక్షలకు పెంపు, 15 ఏండ్ల సర్వీసు నిండిన వారికి మొత్తం పెన్షన్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరాయి. అలాగే ఉద్యోగులు, పెన్షనర్లు చనిపోతే ఇప్పుడిస్తున్న రూ.30 వేల దహన ఖర్చులను రూ.75 వేలకు పెంపు, హౌజ్ బిల్డింగ్ అడ్వాన్స్‌లను ఇప్పుడున్న స్థానాన్ని పెంచి రూ.30 నుంచి రూ.50 లక్షలకు పెంచడం, కామన్ క్యాటగిరీ ఉద్యోగుల వేతనానికి సంబంధించి జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్ స్కేళ్లను ధరల ఆధారంగా పెంచి ఇవ్వడం తదితర అంశాలపై ఉద్యోగ సంఘాలు ప్రతిపాదనలు సమర్పించాయి.

పుట్టెడు దుఃఖంలోనూ పరీక్ష కేంద్రానికి..

- పురుగుల మందుతాగి తండ్రి బలవన్మరణం
- మనోధైర్యంతో పరీక్ష రాసిన అన్నదమ్ములు

జగిత్యాల జిల్లా పెగడపల్లి ప్రభుత్వ పాఠశాలలో పరీక్షా కేంద్రం వద్ద అన్నదమ్ములు రాము, లక్ష్మణ్

పెగడపల్లి, మార్చి 19: పురుగుల మందు తాగి తండ్రి ఆత్మహత్య చేసుకోగా, ఆ ఇద్దరు కవలలు పుట్టెడు దుఃఖంలోనూ పదోతరగతి పరీక్ష రాశారు. ఈ విషాదకరమైన ఘటన జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం బతికపల్లిలో చోటుచేసుకున్నది. బతికపల్లికి చెందిన గాజె చంద్రయ్య మూడు రోజుల క్రితం పురుగులమందు తాగాడు. జగిత్యాల దవాఖానలో చికిత్సపొందుతూ, సోమవారం రాత్రి మృతిచెందాడు. చంద్రయ్యకు ఇద్దరు కవలలైన కొడుకులు రాము, లక్ష్మణ్ స్థానిక జడ్పీహెచ్‌ఎస్‌లో పదోతరగతి చదువుతున్నారు. తండ్రి చనిపోయిన దుఃఖంలో ఉన్నవారికి ఉపాధ్యాయులు, బంధువులు మనోధైర్యాన్ని కల్పించడంతో మంగళవారం వారు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో హిందీ పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష పూర్తయ్యాక తండ్రి దహన సంస్కార కార్యక్రమంలో పాల్గొన్నారు.

దేవరకద్రలోనూ..

దేవరకద్ర, మార్చి 19 : మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రకు చెందిన నట్టలి అంజమ్మ సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందింది. ఆమెకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. రెండో కూతురు జ్యోతి పదో తరగతి చదువుతున్నది. సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభంకాగా.. మంగళవారం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల సెంటర్‌లో హిందీ పరీక్షను ఆమె పుట్టెడు దుఃఖంతో రాసింది. అనంతరం తల్లి అంత్యక్రియల్లో పాల్గొన్నది.

ఫిషరీస్ చైర్మన్ పదవి ముదిరాజ్‌లకే కేటాయించాలి

- డాక్టర్ గుండ్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్

ఖైరతాబాద్, మార్చి 19: ఫిషరీస్ కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని వేరే సామాజికవర్గానికి కేటాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ ముదిరాజ్ మహా సంఘం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ గుండ్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్ చెప్పారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ‘మత్స్యకారుల సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి. ఇప్పటికైనా ఫిషరీస్ కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని ముదిరాజ్‌లకే కేటాయించాలి’ అని కోరారు. 2009 ఫిబ్రవరి 19న నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం ముదిరాజ్‌లను బీసీ (డీ) నుంచి బీసీ (ఏ)లోకి మార్చాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మెదక్ ఎంపీ సీటును నీలం మధుకు కేటాయించాలని సూచించారు. సమావేశంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు గొడుగు శ్రీనివాస్ ముదిరాజ్, తెలంగాణ ముదిరాజ్ మహా సంఘం రాష్ట్ర కో కన్వీనర్ అల్లుడు జగన్ ముదిరాజ్, సమన్వయకర్త బొక్క శ్రీనివాస్ ముదిరాజ్, రంజిత్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia Details డ.మ